**(విశాల భారతి)గూడూరు :** మానుకోట జిల్లా కేంద్రంలో నలంద డిగ్రీ కళాశాలలో జిల్లా జేఏసీ చైర్మన్ డాక్టర్ డోలి సత్యనారాయణ ను మర్యాదపూర్వకంగా కలిసి ఉద్యమ జేఏసీ కళాకారులకు సాంస్కృతిక సారధిలో ఉద్యోగ అవకాశం కల్పించేందుకు సహకరించాలని వినతి పత్రం అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా ఉద్యమ గాయకుడు పెరుమాండ్ల శ్రీనివాస్. మాట్లాడుతూ తెలంగాణ మలిదశ ఉద్యమంలో జిల్లా జేఏసీకి అనుసంధానంలో ఉద్యమ కళాకారుల జేఏసీ జిల్లా కన్వీనర్ కంబాలపల్లి సత్యనారాయణ మరియు గూడూరు మండల జేఏసీ కన్వీనర్ డాక్టర్ అంబాల అంబరీష్. ఆధ్వర్యంలో ఆనాటి రాష్ట్ర జేఏసీ చైర్మన్ ప్రస్తుత ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం. ఆదేశాల మేరకు మానుకోట జిల్లాతో పాటు గూడూరు మండల కేంద్రంలో తెలంగాణ రాష్ట్రం సిద్ధించాలని తపనతో కళాకారులు గల్లి నుండి ఢిల్లీ వరకు కాలుకు గజ్జగట్టి గోసి గొంగడి వేసి సంకన డబ్బులు వేసి ఆటపాటలతో ప్రజలను చైతన్యం చేసి మలిదశ తెలంగాణ ఉద్యమానికి కుటుంబాలకు దూరంగా ఉంటూ తెలంగాణ రాష్ట్రం సాధనే ధ్యేయంగా తమ ఆటపాటలతో అలుపెరుగని పోరాటం చేసిన రాష్ట్ర ఏర్పాటు ప్రక్రియలో ముందు వరుసలో నిలిచిన కళాకారులకు ఈ ప్రజా పాలన ప్రభుత్వం మేనిఫెస్టో ప్రకటించిన సందర్భంగా ని కార్స్ అయిన ఉద్యమ కళాకారులకు సాంస్కృతిక సారధిలో ఉద్యోగం అవకాశం కల్పించి మిగతా కళాకారులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందెందుకు ఉద్యమకారుల కమిటీ సభ్యులు ప్రొఫెసర్ ఎమ్మెల్సీ కోదండరాం సార్ కు తెలియజేసి ఆనాడు జేఏసీకి వెన్నుతట్టి ఉన్న కళాకారులకు పారదర్శకంగా ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు సహకరించాలని మానుకోట జేఏసీ చైర్మన్ డాక్టర్ డోలి సత్యనారాయణకు తెలియజేసిన గూడూరు ఉద్యమ గాయకుడు పెరుమాండ్ల శ్రీనివాస్.

## ఆటో డ్రైవర్ల శ్రమ వెలకట్టలేనిది: సర్పంచ్ డాక్టర్ వేమూరి సత్యనారాయణ



**మునగాల, (విశాల భారతి):** మండల పరిధిలోని నర్సింహాపురం గ్రామ పంచాయతీ ఆవరణలో ప్రపంచ ఆటో డ్రైవర్ల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. గ్రామ సర్పంచ్ డాక్టర్ వేమూరి సత్యనారాయణ ఆధ్వర్యంలో గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్లను శాలువాలతో సన్మానించి, స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. రాత్రింబవళ్లు కష్టపడుతూ ప్రజలను, విద్యార్థులను, కూలీలను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చుతున్న ఆటో డ్రైవర్ల శ్రమ వెలకట్టలేనిదని కొనియాడారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ పథకం వల్ల ఆటో కార్మికులు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారని, ప్రభుత్వం వారికి సబ్సిడీలు, బీమా, గుర్తింపు కార్డులతో పాటు ప్రతి నెలా పెన్షన్ ఇచ్చి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి బాలరాజు, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు మరియు ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

## నక్కలపల్లిలో తల్లిపాలపై అవగాహన

**ప్రపంచ తల్లిపాల వారోత్సవాల్ల కార్యక్రమం**



**మొయినాబాద్ ఆగస్టు 1 (విశాలభారతి):** ప్రపంచ తల్లిపాల వారోత్సవాల సందర్భంగా నక్కలపల్లి గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆగస్టు 1 నుంచి 7 వరకు నిర్వహిస్తున్న వారోత్సవాల్లో భాగంగా అంగన్‌వాడీ టీచర్ కాంతమ్మ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో తల్లిపాల ప్రాముఖ్యతపై గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పించారు. గ్రామ సర్పంచ్ మంగలారం యాదయ్య, ఉపసర్పంచ్ నిరంజన్ గౌడ్ మాట్లాడుతూ శిశువు జన్మించిన వెంటనే ముర్రుపాలు (కొలస్ట్రం) తప్పనిసరిగా పట్టించాలని సూచించారు. తల్లిపాలు శిశువుకు సంపూర్ణ పోషకాహారంతో పాటు రోగనిరోధక శక్తిని అందిస్తాయని, పుట్టిన తర్వాత తొలి ఆరు నెలల పాటు కేవలం తల్లిపాలనే ఇవ్వడం ద్వారా శిశువు ఆరోగ్యంగా ఎదుగుతాడని వివరించారు.కార్యక్రమంలో వార్డు సభ్యురాలు తేజశ్రీ, పంచాయతీ కార్యదర్శి యాదగిరి, ద్వాక్రా సంఘం అధ్యక్షురాలు వరలక్ష్మి, వీఓఏ శిరీష, అంగన్‌వాడీ టీచర్ కాంతమ్మ, అంగన్‌వాడీ ఆయా అనసూయ, గర్భిణులు, బాలింతలు, గ్రామ మహిళలు పాల్గొన్నారు.

## షాది ఖానా వార్తపై నా స్పందన

**సయ్యద్ మీడియా ప్రతినిధి**



**చౌటుప్పల్ విశాల భారతి:** పత్రికలో రాసిన వార్త పూర్తిగా ప్రజా ప్రయోజనాన్ని దృష్టిలో పెట్టుకొని రాసినదే. లోకం తీరు పత్రిక ప్రతినిధి సయ్యద్.నేను ఉన్నది ఉన్నట్టే వివరించాను. ప్రభుత్వానికి సంబంధించిన ప్రజా సదుపాయాల పరిస్థితిపై స్పందించడం ఒక పాత్రికేయునిగా నా బాధ్యత. వ్యక్తిగతంగా ఎవరి కుటుంబం గురించి గానీ, ఎవరి పరువు తీసే విధంగా గానీ నేను ఎక్కడా రాయలేదు. షాది ఖానా చైర్మన్ పేరు కూడా ప్రస్తావించలేదు. పేద ప్రజలకు ఉపయోగపడాల్సిన మాధవరెడ్డి షాది ఖానా ప్రస్తుతం నిర్లక్ష్యానికి గురవుతోందనే అంశాన్ని మాత్రమే ప్రజల దృష్టికి తీసుకువచ్చాను. అక్కడ పందులు తిరుగుతున్నాయన్నది వాస్తవం, కోతులు సంచరిస్తున్నాయన్నది కూడా వాస్తవమే. కావాలంటే మీరు స్వయంగా అక్కడికి వచ్చి పరిశీలించండి. నేను తప్పుగా రాశానా లేదా అన్నది ప్రత్యక్షంగా చూసిన తర్వాత మీరే నిర్ణయించండి. ప్రజా సదుపాయాలు పరిశుభ్రంగా, సక్రమంగా ఉండాలని కోరుకోవడమే నా ఉద్దేశ్యం. పేదలకు ఉపయోగపడే ఈ షాది ఖానాను అభివృద్ధి చేసి, అందుబాటులో ఉంచాలని సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నాను.

## తల్లిపాలే అమృతం శిశువుకు తొలి టీకా



**మరిపెడ విశాల భారతి:** తల్లిపాలే శిశువుకు అమృతమని, పుట్టిన వెంటనే అందించే ముర్రుపాలే ప్రకృతి ప్రసాదించిన తొలి టీకా అని మరిపెడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ గుగులోతు రవి అన్నారు. ప్రపంచ తల్లిపాల వారోత్సవాల సందర్భంగా శనివారం మరిపెడ మున్సిపాలిటీ పరిధిలోని హౌసింగ్ బోర్డు అంగన్‌వాడీ కేంద్రంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో గర్భిణీలు, బాలింతలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా డాక్టర్ గుగులోతు రవి మాట్లాడుతూ.. శిశువు పుట్టిన మొదటి గంటలోపు ముర్రుపాలు పట్టించడం ఎంతో ముఖ్యమన్నారు. ముర్రుపాలు శిశువులో రోగనిరోధక శక్తిని పెంచి డయేరియా, నిమోనియా వంటి వ్యాధుల నుంచి రక్షణ కల్పిస్తాయని తెలిపారు. తొలి ఆరు నెలల వరకు తల్లిపాలు మాత్రమే ఇవ్వాలని, నీరు లేదా ఇతర ఆహార పదార్థాలు అవసరం లేదని సూచించారు. ఐసీడీఎస్ సీడీపీఓ ఎల్లమ్మ మాట్లాడుతూ.. ముర్రుపాలపై ఉన్న అపోహలను వీడి ప్రతి తల్లి బిడ్డకు తప్పనిసరిగా పట్టించాలని కోరారు. ఆరు నెలల తర్వాత అదనపు పౌష్టికాహారంతో పాటు రెండేళ్ల వరకు తల్లిపాలు ఇవ్వడం వల్ల పిల్లల శారీరక, మానసిక ఎదుగుదల మెరుగ్గా ఉంటుందని వివరించారు.కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్వైజర్ రాజ్యలక్ష్మి, ఏఎన్ఎం ఝాన్సీ, ఆశా కార్యకర్త లలిత, అంగన్‌వాడీ టీచర్లు, గర్భిణీలు, బాలింతలు పాల్గొన్నారు.

## అబ్బాయిపాలెంలో తల్లిపాల వారోత్సవాలు



**మరిపెడ, విశాల భారతి:** ప్రపంచ తల్లిపాల వారోత్సవాల సందర్భంగా శనివారం మరిపెడ మండలంలోని అబ్బాయిపాలెం గ్రామంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నవజాత శిశువులకు తొలి ఆరు నెలల పాటు తల్లిపాలు మాత్రమే ఇవ్వడం వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాలపై గర్భిణీలు, బాలింతలకు అవగాహన కల్పించారు.కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సోమ్లా నాయక్, సూపర్వైజర్ ఉషా, ఎంఎల్‌హెచ్‌పీ అనిత పాల్గొని తల్లిపాల ప్రాముఖ్యతను వివరించారు. అనంతరం అంగన్‌వాడీ టీచర్లు సత్యవతి, విజయలక్ష్మి, సంపూర్ణ, కృష్ణకుమారి, లలిత గర్భిణీలు, బాలింతలకు పోషకాహారం, శిశు సంరక్షణపై సూచనలు అందించారు.

## ఊర పండుగ ఏర్పాట్లను పరిశీలించిన నగర మేయర్ ఉమారాణి పట్టణ డి సి సి అధ్యక్షుడు బొబ్బిలి రామకృష్ణ



**జిల్లా నిజామాబాద్, విశాల భారతి:** నిజామాబాద్ నగరంలో నిర్వహించనున్న సంప్రదాయ ఊర పండుగ ఏర్పాట్లకు సంబంధించి నగర మేయర్ కూరగాయల ఉమారాణి, నగర డీసీసీ అధ్యక్షులు బొబ్బిలి రామకృష్ణ మరియు సర్వసమాజ్ కమిటీ ప్రతినిధులు సంయుక్తంగా క్షేత్రస్థాయి పరిశీలన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, వేడుకలకు పెద్ద ఎత్తున భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున, ఊరేగింపు మార్గాల్లో మరియు ఆలయ పరిసరాల్లో పారిశుధ్య చర్యలు సక్రమంగా ఉండాలని, వేడుకల సందర్భంగా ప్రధాన మార్గాలు, ఆలయ పరిసరాల్లో ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్ చేపట్టాలని, ఊరేగింపు సాగే దారుల్లో వీధి దీపాలు (LED) అన్నీ సక్రమంగా పనిచేసేలా చూడాలని మునిసిపల్ అధికారులకు సూచించారు. భక్తులు మరియు ఊరేగింపు వెళ్లే మార్గాల్లో గుంతలను పూడ్చి, రోడ్లను సుగమం చేయాలని అధికారులకు ప్రతిపాదించారు. పండుగ నిర్వహణ సమయంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ట్రాఫిక్ మళ్లింపు, పోలీసు బందోబస్తు ఏర్పాట్లను సమీక్షించారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో సీసీ కెమెరాలు, రక్షణ బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. నగరపాలక సంస్థ అధికారులు, సర్వసమాజ్ కమిటీ సభ్యులు మరియు ప్రజాప్రతినిధులు పరస్పరం సమన్వయంతో పనిచేసి ఉత్సవాలను విజయవంతం చేయాలని కోరారు. అత్యవసర వైద్య సేవల కోసం అంబులెన్స్, హెల్త్ క్యాంపులను సిద్ధంగా ఉంచాలని అధికారులను కోరారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తుల కోసం ప్రధాన కూడళ్ల వద్ద తాగునీటి చలివేంద్రాలు, నీడ కొరకు షామియానాలు ఏర్పాటు చేయనున్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమీషనర్, సానిటరీ సిబ్బంది, సర్వసమాజ్ కమిటీ కన్వీనర్ రామర్తి గంగాధర్, కోకన్వీనర్ ఆదే ప్రవీణ్, కోఆప్షన్ మెంబెర్ నరేందర్ సింగ్, కాంగ్రెస్ నాయకులు కరాటే రమేష్, బంటుబలరాం, ఆమ రాజు, లవంగ ప్రమోద్,అవీన్ మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## అంకిరెడ్డి గ్రామపంచాయతీలో గ్రామ రచ్చబండపై ప్రజా సమావేశం



**జిపిడిపి ప్రణాళిక,అభివృద్ధి, సంక్షేమంపై విస్తృత చర్చ**

**చౌటుప్పల్ విశాల భారతి :**

మండలంలోని శనివారం రోజున అంకిరెడ్డి గ్రామపంచాయతీ పరిధిలోని గ్రామ రచ్చబండ వద్ద గ్రామ సభ జరిగింది.ఈ సమావేశానికి గ్రామ సర్పంచ్, సర్పంచ్ల ఫోరం చౌటుప్పల్ మండల అధ్యక్షుడు సుర్వి మల్లేష్ గౌడ్ అధ్యక్షత వహించారు. సమావేశంలో ప్రధానంగా అంశాలపై చర్చ జరిగింది. జలసిరి కార్యక్రమం: గ్రామంలో నీటి సంరక్షణ, వర్షపు నీటి నిల్వపై ప్రణాళిక జి.పి.డి.పి యాక్షన్ ప్లాన్: వచ్చే ఆర్థిక సంవత్సరానికి గ్రామ అభివృద్ధి ప్రణాళిక రూపకల్పన ఆదాయవ్యయాల లెక్కలు: గడిచిన 6 నెలల గ్రామపంచాయతీ ఆదాయం, ఖర్చుల వివరాలను సర్పంచ్ సభ ముందు ఉంచారు గ్రామ అభివృద్ధి, సంక్షేమ పథకాలు: ప్రభుత్వ పథకాల అమలు తీరు, లబ్ధిదారుల ఎంపిక చేయవలసిన పనులు: రోడ్లు, డ్రైనేజీ, వీధి దీపాలు, పారిశుధ్యం తదితర అవసరాలపై ప్రజల నుంచి సూచనలు స్వీకరణ ప్రభుత్వ ఆస్తుల వివరాలు: గ్రామంలోని ప్రభుత్వ భూములు, భవనాలు, ఇతర ఆస్తుల వివరాలను సర్పంచ్ వివరించారు. ఈ సందర్భంగా సర్పంచ్ సుర్వి మల్లేష్ గౌడ్ మాట్లాడుతూ, గ్రామ అభివృద్ధి అందరి భాగస్వామ్యంతోనే సాధ్యమని, ప్రజలు ఇచ్చే సూచనల ఆధారంగా ప్రాధాన్యత క్రమంలో పనులు చేపడతామని తెలిపారు. పారదర్శకతతో నిధుల వినియోగం ఉంటుందని హామీ ఇచ్చారు. సమావేశంలో పాల్గొన్నవారు ఉప సర్పంచ్ వలందాస్ మహేష్ గౌడ్, వార్డు సభ్యులు బత్తుల అనుష మహేష్ గౌడ్, పాలెం వెంకటేశం గౌడ్, ముద్ద లింగస్వామి గౌడ్, దొడ్ల అండాలు శేట్టయ్య గౌడ్, దండుగల వెంకటేశం, బొమ్మని శ్రావణి స్వామి గౌడ్, రాపోలు రేణుక మల్లేశం, గ్రామపంచాయతీ కార్యదర్శి గంగాపురం పాండు గౌడ్, చౌటుప్పల్ ఎస్.ఐ శ్రీ సుర కృష్ణ మల్ గారు, ఏ.ఈ.ఓ, అంగన్వాడి టీచర్లు, ఆశా వర్కర్లు, ఉపాధ్యాయులు, గ్రామస్థాయి అధికారులు పాల్గొన్నారు. అదేవిధంగా పెండెం లక్ష్మి మహిళా సంఘం అధ్యక్షురాలు, మాజీ సర్పంచ్ సుర్వి సత్తయ్య గౌడ్, యాట శంకరయ్య, పి. శ్రీధర్ రెడ్డి, బత్తుల జంగయ్య గౌడ్, భీమగోని బాలరాజ్, పి. శ్రీనివాస్ రెడ్డి, భీమగోని మల్లేశం గౌడ్, ముద్దం మల్లయ్య గౌడ్, బిక్షమయ్య గౌడ్, ముద్దం నరసింహ గౌడ్, పల్లం అంజయ్య గౌడ్, సుర్వి నరసింహ గౌడ్ తో పాటు గ్రామపంచాయతీ సిబ్బంది, గ్రామ పెద్దలు, మహిళలు, యువకులు పెద్ద సంఖ్యలో హాజరై తమ అభిప్రాయాలు తెలియజేశారు.

# ఇందిరమ్మ ఇండ్లకు బూస్టప్

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**



తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న అర్బన్ ఇందిరమ్మ ఇండ్ల స్కీమ్‌కు కేంద్ర ప్రభుత్వం నుంచి అపూర్వమైన సానుకూల స్పందన లభిస్తున్నది. ప్రధానమంత్రి ఆవాస్ యోజన అర్బన్ స్కీమ్ కింద ప్రతీ రాష్ట్రానికి కొన్ని ఇండ్లను కేంద్రం కేటాయిస్తున్నది. ఇందులో భాగంగా తెలంగాణ రాష్ట్రానికి మొత్తం 3.89 లక్షల ఇండ్లను మంజూరు చేసింది. వీటి కోసం రూ. 6,552 కోట్లను కేటాయించగా అందులో రూ. 4,168 కోట్లను దశలవారీగా రిలీజ్ చేస్తున్నది. ఈ ఏడాది తొలి ఇన్‌స్టాల్‌మెంట్ కింద రూ. 253.73 కోట్లు నేరుగా వచ్చాయి. దీంతో అర్బన్ ఇందిరమ్మ ఇండ్ల స్కీమ్‌కు ఊహించని స్థాయిలో బూస్టప్ దక్కినట్లయింది. అర్హులైన పేదలకు సత్వరమే లబ్ధి చేకూర్చేందుకు అధికారులు అన్ని చర్యలు వేగవంతం చేశారు. ప్రభుత్వ తాజా నిర్ణయాలతో నిరుపేదల సొంత ఇంటి కల నెరవేరే దిశగా అడుగులు పడుతున్నాయి. అర్బన్ ప్రాంతాల్లో పారదర్శకంగా ఈ లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ కొనసాగుతోంది. ఇప్పటికే క్యూర్ ఏరియాలో అర్బన్ ఇందిరమ్మ ఇండ్ల కోసం రాష్ట్ర ప్రభుత్వం అర్హుల నుంచి దరఖాస్తులను ఆహ్వానించింది. ఆ దరఖాస్తుల ప్రక్రియ ఎంతో వేగవంతంగా కొనసాగుతున్నది. అర్బన్ ఏరియాలోని పేదలకు అలాగే మధ్య తరగతి ప్రజలకు సొంత గూడు ఉండాలన్న లక్ష్యంతో ఈ స్కీమ్‌ను తీసుకొచ్చారు. ప్రస్తుతం నివసిస్తున్న ఏరియాల్లోని లబ్ధిదారులకు అందుబాటులో ఉండేలా వీటిని నిర్మించాలని సీఎం రేవంత్ రెడ్డి ఇటీవల అధికారులను ప్రత్యేకంగా ఆదేశించారు. కేంద్రం మంజూరు చేసిన 3.89 లక్షల ఇండ్లు క్యూర్ ప్రాంతానికి మాత్రమే కాకుండా రాష్ట్రంలోని 93 పట్టణాలకు వర్తించనుంది. ఫలితంగా రాష్ట్రంలోని ఇతర చిన్న పట్టణాల్లోనూ ఇండ్ల నిర్మాణం వేగంగా ఊపందుకోనుంది. పట్టణాల్లోని పేద కుటుంబాలకు ఉచితంగా లేదా రాయితీపై ఇండ్లు అందించడమే ధ్యేయంగా ప్రభుత్వం పావులు కదుపుతోంది. ఎలాంటి అవినీతికి తావులేకుండా ఈ భారీ గృహనిర్మాణ ప్రాజెక్టును విజయవంతంగా పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వం సంకల్పించింది. పట్టణాల్లోని పేదలు అలాగే మధ్య తరగతి ప్రజలకు సొంత ఇల్లు ఉండాలన్న రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యానికి కేంద్రం నుంచి మరో పాజిటివ్ రెస్పాన్స్ వచ్చింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వరుసగా చేస్తున్న ప్రతిపాదనలకు మరియు విజ్ఞప్తులకు స్పందించిన మోదీ సర్కార్ రాష్ట్రంలోని అర్బన్ ఏరియాల్లో 3.89 లక్షల ఇండ్లకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దీంతో క్యూర్ పరిధితో పాటు ఇతర పట్టణాల్లో ఇందిరమ్మ ఇండ్లు వేగంగా ఊపందుకోనున్నాయి. మార్చి అలాగే జూన్ నెలల్లో జరిగిన సెంట్రల్ శాంక్షనింగ్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశంలో తెలంగాణకు మంజూరు చేసిన ఇండ్లు, కేటాయించిన నిధులపై సుదీర్ఘంగా చర్చ జరిగింది. పీఎంఏవై 2.0 స్కీమ్ కింద రాష్ట్రానికి ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఫస్ట్ ఇన్స్టాల్మెంట్ కింద రూ. 253.73 కోట్లు విడుదలయ్యాయి. కేంద్రం విడుదల చేసిన ఈ నిధులతో నిర్మాణ పనులను వెంటనే ప్రారంభించాలని గృహనిర్మాణ శాఖ అధికారులు నిర్ణయించారు. లబ్ధిదారుల ఖాతాల్లోకి నేరుగా డబ్బులు జమ చేసేందుకు అవసరమైన సాంకేతిక ఏర్పాట్లను కూడా పూర్తి చేశారు. రాష్ట్ర ప్రభుత్వ క్యూర్ రీజియన్‌లో మొత్తం లక్ష ఇందిరమ్మ ఇండ్లను నిర్మించాలని టార్గెట్‌గా పెట్టుకున్నది. ఫస్ట్ ఫేజ్‌లో 16 అసెంబ్లీ నియోజకవర్గాల్లో 480 చొప్పున 7,680 ఇండ్లను నిర్మించనున్నది. ఇందులో ప్రభుత్వం ఒక్కో ఇంటికి రూ. 5 లక్షల చొప్పున ఖర్చు చేయనున్నది. సుమారు రూ. 384 కోట్లు దీనికోసం ఖర్చు కానున్నది. మార్చి మరియు జూన్ నెలల్లో జరిగిన సీఎస్ఎంసీ సమావేశంలో ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి గాను కేంద్రం నుంచి రూ. 253.73 కోట్లు రిలీజ్ అయ్యాయి. ఇవి రావడంతో క్యూర్ ప్రాంతంలో ఇండ్ల కోసం రూ. 130 కోట్లను సర్దుబాటు చేసుకోవాల్సి వస్తున్నది. రాష్ట్రానికి మొత్తం 11 లక్షల ఇండ్లను ఇవ్వాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇటీవల కేంద్ర ప్రభుత్వానికి రిక్వెస్టు చేశారు. తాజా పరిణామాలతో ఆ విజ్ఞప్తికి కూడా సానుకూల స్పందన లభిస్తుందని అధికారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. అర్బన్ ప్రాంతాల్లో ఒక్కో ఇందిరమ్మ ఇంటికి రూ. 5 లక్షల సబ్సిడీని ఖరారు చేసిన ఫార్ములా ప్రకారం కేంద్రం తన వాటాగా రూ. 1.50 లక్ష ఇస్తుంది. రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ క్యూర్ అర్బన్ ఇందిరమ్మ ఇండ్ల ఫస్ట్ ఫేజ్‌లో 7,680 నిర్మించాలని లక్ష్యంగా పెట్టుకున్నా కేంద్రానికి మాత్రం 8,338 ఇండ్లను ఇవ్వాల్సిందిగా ప్రతిపాదించింది. రాష్ట్రం అడిగినన్ని ఇండ్లను ఇవ్వకపోవచ్చనే అభిప్రాయం గతంలో నుంచి కొనసాగుతున్నది. ఈ ప్రతిపాదనను పరిశీలించి ఆమోదం తెలిపిన సీఎస్ఎంసీ కేవలం క్యూర్ ప్రాంతానికి పరిమితం చేయకుండా 93 పట్టణాల్లో నిర్మించేలా నిర్ణయం తీసుకున్నది. ఈ ఇండ్లకు మొత్తం రూ. 541.97 కోట్లు ఖర్చవుతుందని అంచనా వేసి కేంద్ర వాటాగా రూ. 125.07 కోట్లకు ఆమోదం తెలిపింది. రాష్ట్రం తన వాటాగా రూ. 303.97 కోట్లను భరించాల్సి ఉంటుంది. ఏడాదిన్నర వ్యవధిలో ఇండ్లను నిర్మించాలని కేంద్ర స్కీమ్ టార్గెట్ ఉన్నా రాష్ట్రం మాత్రం సంవత్సర కాలంలోనే పూర్తి చేయాలని రోడ్ మ్యాప్ రూపొందించింది. నాణ్యతా ప్రమాణాలు ఏమాత్రం తగ్గకుండా వేగంగా పనులు పూర్తి చేయాలని ఇంజనీరింగ్ అధికారులను ప్రభుత్వం గట్టిగా ఆదేశించింది. రాష్ట్రంలోని అర్బన్ ఇండ్లపై జులై 13న కేంద్ర ప్రభుత్వం తయారుచేసిన అధికారిక నోట్ ప్రకారం అనేక కీలక విషయాలు వెల్లడయ్యాయి. రాష్ట్రానికి మొత్తం 3,89,372 ఇండ్లు మంజూరు కాగా అందులో 2,73,453 ఇండ్లు గ్రౌండింగ్ అయ్యాయి. ఇప్పటివరకు మొత్తం 2,29,673 ఇండ్ల నిర్మాణం పూర్తిగా పూర్తయింది. పూర్తయిన వాటిలో 1,00,251 ఇండ్లలో లబ్ధిదారులు ఇప్పటికే నివాసం ఉంటున్నారు. అలాగే నిర్మాణం పూర్తయినా ఇంకా నివాసం లేని ఇండ్లు 39,654 వరకు ఉన్నాయి. ప్రస్తుతం వివిధ దశల్లో 43,780 ఇండ్లు నిర్మాణంలో ఉన్నాయి. శాంక్షన్ అయ్యి ఇంకా గ్రౌండింగ్ కాని ఇండ్లు 1,15,919 వరకు ఉన్నట్లు గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. మిగిలిన అన్ని ఇండ్ల నిర్మాణాలను వీలైనంత త్వరగా పూర్తి చేసి పేద ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ప్రభుత్వం ప్రణాళికలు రచిస్తోంది. ఈ గృహ నిర్మాణ ప్రాజెక్టు ద్వారా వేలాది పేద కుటుంబాల జీవితాల్లో కొత్త వెలుగులు నింపాలని రాష్ట్ర సర్కార్ ధ్యేయంగా పెట్టుకున్నది.

# శంషాబాద్‌లో మిస్సింగ్ కేసు నమోదు

**యువకుడు ఆచూకీ కోసం గాలింపు**



**రాజేంద్రనగర్, విశాల భారతి :** శంషాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఒక యువకుడు అదృశ్యమైన ఘటన కలకలం రేపింది. ముచ్చింతల్ గ్రామానికి చెందిన పలగిరి రాజా మోహన్ రెడ్డి (29) అనే యువకుడు అనుమానాస్పద పరిస్థితుల్లో కనిపించకుండా పోవడంతో పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఫిర్యాదుదారు జమ్మలమడుగు ధామిని (28) తెలిపిన వివరాల ప్రకారం, ఆమె తన భర్త రాజా మోహన్ రెడ్డితో కలిసి ముచ్చింతల్ గ్రామంలో అద్దె గృహంలో నివసిస్తూ, జిమిస్ మెడికల్ కాలేజీలో పీజీ రెండో సంవత్సరం చదువుతోంది. రాజా మోహన్ రెడ్డి ఇంటి వద్దే ఉంటూ కుటుంబ బాధ్యతలు చూసుకుంటున్నాడు. జూలై 31 రాత్రి సుమారు 8 గంటల సమయంలో, ఇంటి యజమాని శివప్రసాద్‌తో కలిసి ఫుడ్ తీసుకురావడానికి ఫిర్యాదుదారు కారులో పాలమాకుల గ్రామానికి వెళ్లారు. అనంతరం రాత్రి 8:30 ప్రాంతంలో శివప్రసాద్ ఒంటరిగా ఇంటికి చేరుకుని, రాజా మోహన్ రెడ్డి కనిపించడం లేదని తెలిపాడు. ఈ విషయంపై ఆందోళన చెందిన భార్య, తన భర్తకు పలుమార్లు ఫోన్ చేసినా స్విచ్ ఆఫ్‌గా రావడంతో పాటు చుట్టుపక్కల ప్రాంతాలు, బంధువుల వద్ద వెతికినా ఎటువంటి సమాచారం లభించలేదు. అదృశ్యమైన రాజా మోహన్ రెడ్డి ఎత్తు సుమారు 6 అడుగులు, చామనచాయ రంగు కలిగినవాడు. తెలుగు, హిందీ, ఇంగ్లీష్ భాషలు మాట్లాడగలడు. చివరిసారిగా యెల్లో రంగు టీషర్ట్, బ్లాక్ ప్యాంట్ ధరించి ఉన్నట్లు సమాచారం. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన శంషాబాద్ పోలీసులు యువకుడి ఆచూకీ కోసం గాలింపు చర్యలు చేపట్టారు. ఇన్స్పెక్టర్ వై. సురేందర్ రెడ్డి తెలిపిన ప్రకారం, కేసును సీరియస్‌గా తీసుకుని అన్ని కోణాల్లో దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు వెల్లడించారు.

# ఉప్పర్‌పల్లిలో రోడ్ల అభివృద్ధి పనుల పరిశీలన



**రాజేంద్రనగర్, విశాల భారతి :** ఉప్పర్‌పల్లి గ్రామ పరిధిలోని 113 హైదర్‌గూడ డివిజన్‌లో రోడ్ల అభివృద్ధి పనులపై అధికారులు సమీక్ష నిర్వహించారు. డీఈ, ఏఈఈ మరియు ఫీల్డ్ అధికారులతో కలిసి ఎర్రబోడ మెయిన్ రోడ్, చైతన్య విలాస్, వెంకటేశ్వర కాలనీ తదితర ప్రాంతాలను సందర్శించి, అత్యవసరంగా చేపట్టాల్సిన రోడ్ల పనులను పరిశీలించి అంచనా వేశారు. ప్రాంతీయ ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకుంటూ, త్వరితగతిన పనులు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని అధికారులు సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, గ్రామ పెద్దలు, శ్రేయోభిలాషులు పాల్గొన్నారు. అత్యవసర రోడ్ల అభివృద్ధి పనులకు తక్షణమే పరిపాలనా అనుమతులు మంజూరు అయ్యేలా సహకరిస్తున్న ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్ , జోనల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు.

# యాచారం ప్రెస్ క్లబ్ అధ్యక్షులుగా అంబాల ఆంజనేయులు

**ప్రధాన కార్యదర్శి అలంపల్లి రవీందర్, ఉపాధ్యక్షులుగా ఎట్టి లక్ష్మయ్య**



**విశాల భారతి ఇబ్రహీంపట్నం:** యాచారం మండల ప్రెస్ క్లబ్ అధ్యక్షులుగా పంబాల ఆంజనేయులు, కార్యదర్శి ఆలంపల్లి రవీందర్ లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. శనివారం యాచారం మండల కేంద్రంలో వివిధ ప్రింట్ మీడియా విలేకర్లు సమావేశంలో సీనియర్ జర్నలిస్టు మకపల్లి శ్రీనివాస్ నమస్తే తెలంగాణ జర్నలిస్టు మద్ది యాదగిరి ఆధ్వర్యంలో ప్రెస్ క్లబ్ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షులుగా మకపల్లి శ్రీనివాస్,అధ్యక్షులుగా పంబాల ఆంజనేయులు, ప్రధాన కార్యదర్శి గా ఆలంపల్లి రవీందర్,ఉపాధ్యక్షులుగా ఎట్టి లక్ష్మణ్,గుండె రాఘవేందర్, కోశాధికారి గా మద్ది యాదగిరి,ప్రచార కార్యదర్శి గా నరేందర్ రెడ్డి, సహాయ కార్యదర్శి గా రామ్ చందర్, నరేందర్ ఎన్నికయ్యారు.ఈ సందర్భంగా ఆంజనేయులు మాట్లాడుతూ తనపై నమ్మకంతో విశ్వాసంతో బాధ్యత అప్పగించిన జర్నలిస్టు లందరికీ కృతజ్ఞతలు తెలిపారు. తను ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ సంఘం అభివృద్ధికి కృషిచేస్తూ సమన్వయం తో సమిష్టిగా పనిచేస్తానని, జర్నలిస్టుల సంక్షేమ పథకాల కోసం వారు ఇచ్చిన బాధ్యతలకు కట్టుబడి ఉంటూ కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో పలు పత్రికల విలేకరులు పాల్గొన్నారు.

# అభ్యుదయ నగర్‌లో వర్షపు నీటి సంరక్షణకు ముందడుగు



**రాజేంద్రనగర్, విశాల భారతి :** అభ్యుదయ నగర్ కాలనీలోని బెత్లెహేమ్ ప్రార్థనా మందిర ప్రాంగణంలో నిర్మాణంలో ఉన్న వర్షపు నీటి సంరక్షణ గుంత (రైన్‌వాటర్ హార్వెస్టింగ్ పిట్) ఈరోజు విజయవంతంగా పూర్తయింది. ఈ ప్రాజెక్ట్ ద్వారా సమాజంలో నీటి సంరక్షణపై అవగాహన పెంపొందించడంతో పాటు సహజ వనరుల బాధ్యతాయుత వినియోగాన్ని ప్రోత్సహించడం లక్ష్యంగా చర్చి కమిటీ ముందడుగు వేసింది. ఈ సందర్భంగా చర్చి కమిటీ సభ్యులు మాట్లాడుతూ, ప్రాజెక్ట్ విజయవంతానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. నిర్మాణ పనులు సకాలంలో పూర్తవడానికి కృషి చేసిన సభ్యులు, సహాయకులు, దాతలకు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. కొత్తగా నిర్మించిన ఈ వర్షపు నీటి సంరక్షణ గుంత భూగర్భ జలాల స్థాయిని పెంచడంలో కీలక పాత్ర పోషించనుంది. అదేవిధంగా ప్రార్థనా మందిర ప్రాంగణం మాత్రమే కాకుండా చుట్టుపక్కల ప్రాంతాలకు కూడా దీర్ఘకాలికంగా నీటి వినియోగానికి ఉపయోగపడనుందని కమిటీ సభ్యులు ఆశాభావం వ్యక్తం చేశారు.

# బూతు సంస్కృతికి బీజం వేసింది బిజెపియే..

**ఆమ్ ఆద్మీ పార్టీ సలహాదారులు డాక్టర్ దిడ్డి సుధాకర్**



**ముషీరాబాద్, విశాల భారతి:** రాజకీయాల్లో బూత్ సంస్కృతికి బీజం వేసింది బిజెపి పార్టీ యేనని ఆమ్ ఆద్మీ పార్టీ సలహాదారులు డాక్టర్ దిడ్డి సుధాకర్ విమర్శించారు. గత 12 సంవత్సరాలుగా భారత రాజకీయాల్లో ద్వేషపూరిత భాష వ్యక్తిగత దాడులు సోషల్ మీడియా ట్రోలింగ్ కుటుంబాలపై అసభ్య వాక్యాలు ప్రత్యర్థులను దేశద్రోలుగా చిత్రీకరించడం వంటి విష సంస్కృతిని ప్రోత్సహిస్తుందని మండిపడ్డారు. ప్రజాస్వామ్యంలో విభిన్న అభిప్రాయాలను గౌరవించాల్సిన బాధ్యత ఉన్న అధికార పార్టీయే ఈ భాషకు రాజకీయ గుర్తింపు తీసుకొచ్చిందని విమర్శించారు. నేడు కొందరు యువకులు ఆవేశంలో మాట్లాడిన మాటలపై మాత్రమే చర్చ చేసి ఆ పరిస్థితిని సృష్టించిన రాజకీయ వాతావరణాన్ని విస్మరించడం కపట వైఖరి తప్ప మరొకటి కాదన్నారు. బిజెపి పార్టీ అసభ్య భాషను పూర్తిగా నిర్మూలించినప్పుడే ఇతరులకు నీతులు చెప్పాలని హితవు పలికారు. దేశ రాజకీయాలను విష పూరితనం చేసిన వారే సంస్కారం గురించి ఉపన్యాసాలు ఇస్తే ప్రజలు నమ్మరని, ముందుగా ఈ విషయంపై బీజేపీ పార్టీ మారితే అప్పుడే దేశ రాజకీయాల్లో మర్యాద విలువలు ప్రజాస్వామ్య సంస్కృతి బలపడతాయని శనివారం విడుదల చేసిన పత్రిక ప్రకటనలో డాక్టర్ దిడ్డి సుధాకర్ పేర్కొన్నారు.

# తల్లిపాలు బిడ్డకు దేవుడిచ్చిన వరం

**మల్లెలమడుగు అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవ కార్యక్రమం**



**విశాలభారతి అశ్వాపురం :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మల్లెలమడుగు అంగన్ వాడి కేంద్రంలో తల్లిపాల వారోత్సవాల సందర్భంగా అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ టీచర్ రెడ్డి అరుణ మాట్లాడుతూ తల్లిపాలు బిడ్డకు దేవుడిచ్చిన అమూల్యమైన వరమని తెలిపారు. శిశువు జన్మించిన గంటలోపే ముర్రుపాలు పట్టించడం ఎంతో ముఖ్యమని, బిడ్డకు ఆరు నెలలు నిండే వరకు కేవలం తల్లిపాలు మాత్రమే ఇవ్వాలని సూచించారు. తల్లిపాలు శిశువు ఎదుగుదలకు, రోగనిరోధక శక్తి పెంపొందించడానికి ఎంతో ఉపయోగపడతాయని వివరించారు.అనంతరం "తల్లిపాలు ముద్దు - డబ్బా పాలు వద్దు" అనే నినాదంతో తల్లులకు అవగాహన కల్పిస్తూ, శిశువుల ఆరోగ్యకరమైన ఎదుగుదలకు తల్లిపాలే ఉత్తమ ఆహారమని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మచ్చ నరసింహారావు, ఉప సర్పంచ్ మహేష్, గ్రామ కార్యదర్శి జ్యోతి, పాఠశాల ఉపాధ్యాయుడు శ్యామసుందర్,ఆశా వర్కర్ సుశీల, గర్భిణీలు, బాలింతలు, తల్లులు పాల్గొన్నారు.

# సీబీఐటీలో బి.ఈ./బి.టెక్ ఫ్రెషర్స్‌కు ఘన ఓరియంటేషన్

**రాజేంద్రనగర్, విశాల భారతి :**





తెలంగాణలోని ప్రముఖ స్వయంప్రతిపత్తి ఇంజినీరింగ్ విద్యాసంస్థ చైతన్య భారతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (సీబీఐటీ), హైదరాబాద్‌లో 2026-27 విద్యా సంవత్సరానికి బి.ఈ./బి.టెక్ ప్రథమ సంవత్సరం విద్యార్థులు మరియు వారి తల్లిదండ్రుల కోసం ఓరియంటేషన్ కార్యక్రమం శనివారం ఘనంగా నిర్వహించారు. సీబీఐటీ క్రికెట్ గ్రౌండ్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో వేలాదిమంది విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొని విజయవంతం చేశారు. సాంప్రదాయ దీపప్రజ్వలనతో కార్యక్రమం ప్రారంభమై, అతిథులు, విద్యార్థులు, తల్లిదండ్రులకు ఘన స్వాగతం పలికారు. ఇన్ఫోసిస్ లిమిటెడ్, హైదరాబాద్ డెవలప్‌మెంట్ సెంటర్ వైస్ ప్రెసిడెంట్ & డెలివరీ హెడ్ శ్రీ రఘు బొడ్డుపల్లి ముఖ్య అతిథిగా పాల్గొని, వేగంగా మారుతున్న సాంకేతిక ప్రపంచంలో విజయాన్ని సాధించాలంటే నైపుణ్యాలు, సృజనాత్మకత, నిరంతర అధ్యయనం అవసరమని పేర్కొన్నారు. పరిశ్రమలతో భాగస్వామ్యాలు, పరిశోధన అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని విద్యార్థులకు సూచించారు. భారతీయ విజ్ఞాన సంస్థ (ఐఐఎస్సీ), బెంగళూరులోని ప్రొఫెసర్ శ్రీనివాస్ తలబత్తుల గౌరవ అతిథిగా పాల్గొని, జిజ్ఞాస, పరిశోధనా దృక్పథం, విమర్శనాత్మక ఆలోచన విద్యార్థుల్లో ఉండాలని, ఇంజినీరింగ్ పునాది అంశాలపై పటిష్ట అవగాహన అవసరమని తెలిపారు. సీబీఐటీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సి.వి. నరసింహులు నూతన విద్యార్థులు, తల్లిదండ్రులను ఆహ్వానిస్తూ, సంస్థ గత 47 సంవత్సరాల విద్యా ప్రగతి, స్వయంప్రతిపత్తి హోదా, ఎన్‌బీఏ గుర్తింపు, న్యాక్ A++ గ్రేడ్, ఎన్ఐఆర్ఎఫ్ గుర్తింపు, అద్భుతమైన ప్లేస్‌మెంట్లు, పరిశోధన విజయాలను వివరించారు. విద్యార్థులు విద్య, నాయకత్వం, ఆవిష్కరణల్లో రాణించాలని ఆకాంక్షించారు. విద్యా విధానం, పాఠ్య ప్రణాళిక, మెంటరింగ్ వ్యవస్థ, పరీక్షల నిర్వహణ, ప్లేస్‌మెంట్ కార్యక్రమాలు, పరిశోధన సదుపాయాలు, విద్యార్థి సేవలు, క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలపై సమగ్రంగా వివరించారు. సీబీఐటీ అందిస్తున్న సమగ్ర అభివృద్ధి అవకాశాలను తల్లిదండ్రులు ప్రశంసించారు. కార్యక్రమంలో ఫిజిక్స్ విభాగాధిపతి, ప్రథమ సంవత్సరం కోఆర్డినేటర్ ప్రొఫెసర్ బి. శ్రీనివాస రెడ్డి స్వాగతం పలకగా, డాక్టర్ స్వాత్మారాం రామ్ కృతజ్ఞతలు తెలిపారు. జాతీయ గీతంతో కార్యక్రమం ముగిసింది. ఈ కార్యక్రమం విజయవంతం కావడానికి ఏఈసీ డైరెక్టర్, పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ సురేష్ పబ్బోజు, కన్వీనర్ ప్రొఫెసర్ బి. శ్రీనివాస రెడ్డి, అధ్యాపకులు, సిబ్బంది విశేషంగా కృషి చేశారు.

# మొయినాబాద్ మున్సిపల్ కౌన్సిల్‌లో కీలక నిర్ణయాలు



**రూ.4.25 కోట్ల అభివృద్ధి పనులకు ఆమోదం.. కొత్త కౌన్సిల్ హాల్ ప్రారంభం**

**మొయినాబాద్, ఆగస్టు 1(విశాలభారతి):**

మొయినాబాద్ మున్సిపాలిటీ కార్యాలయంలో శనివారం మున్సిపల్ చైర్‌పర్సన్ అధ్యక్షతన సాధారణ కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. సమావేశానికి ముందు అజీజ్‌నగర్‌లో నూతనంగా నిర్మించిన కౌన్సిల్ మీటింగ్ హాల్, చైర్‌పర్సన్ ఛాంబర్‌ను ప్రారంభించారు.ఉదయం 11 గంటల నుంచి జరిగిన కౌన్సిల్ సమావేశంలో మున్సిపాలిటీ అభివృద్ధి, పారిశుధ్యం, మౌలిక వసతుల కల్పన, ప్రజా సేవల మెరుగుదల, పర్యావరణ పరిరక్షణకు సంబంధించిన పలు కీలక ప్రతిపాదనలను సభ్యులు చర్చించి ఆమోదించారు. పారిశుధ్య నిర్వహణను మరింత సమర్థవంతంగా చేపట్టేందుకు జేసీబీ, జెట్టింగ్ మిషన్, ట్రాక్టర్ ఇంజిన్లు తదితర యంత్ర పరికరాల కొనుగోలుకు కౌన్సిల్ ఆమోదం తెలిపింది. అండర్‌గ్రౌండ్ డ్రైనేజీల నిర్వహణ, కాలువల పూడికతీత, వీధి దీపాల మరమ్మతులు, ఎల్ఈడీ లైట్ల ఏర్పాటు, ప్రజా మరుగుదొడ్ల నిర్మాణం, మున్సిపల్ కార్యాలయంలో ఆర్వో ప్లాంట్, ప్రొజెక్టర్, కంప్యూటర్లు, ప్రింటర్ల కొనుగోలుకు కూడా గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. స్వచ్ఛ భారత్ మిషన్ (ఎస్‌బీఎంయూ 2.0) కింద ఘన వ్యర్థాల నిర్వహణ, ప్రజా మరుగుదొడ్ల ఏర్పాటు, అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనతో పాటు జనగణన శిక్షణ కార్యక్రమాలు, చెట్ల కొమ్మల తొలగింపునకు అవసరమైన పరికరాల కొనుగోలు, మున్సిపల్ ఆస్తుల డిజిటల్ మ్యాపింగ్, జియో ట్యాగింగ్ కార్యక్రమాలకు కౌన్సిల్ ఆమోదం తెలిపింది. మున్సిపాలిటీ పరిధిలోని 26 వార్డుల్లో రోడ్లు, డ్రైనేజీలు, వీధి దీపాలు, గ్రావెలింగ్, ప్యాచ్‌వర్క్ తదితర మౌలిక వసతుల అభివృద్ధికి సుమారు రూ.4.25 కోట్ల విలువైన పనుల ప్రతిపాదనలకు కౌన్సిల్ ఆమోదం తెలిపింది. వనమహోత్సవ కార్యక్రమం విజయవంతంగా నిర్వహించేందుకు మొక్కల కొనుగోలు, సంరక్షణ, ట్రీ గార్డులు, కార్మిక వ్యయానికి అవసరమైన నిధుల వినియోగానికి అనుమతి మంజూరు చేశారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు వీధి దీపాల నిర్వహణను పీటీసీ ఇండియా లిమిటెడ్ ద్వారా చేపట్టే ప్రతిపాదనకు కూడా ఆమోదం లభించింది. బోనాల పండుగ సందర్భంగా మున్సిపాలిటీ పరిధిలోని 26 వార్డుల దేవాలయాల వద్ద సీరియల్ లైటింగ్, ఫోకస్ లైటింగ్, సౌండ్ సిస్టమ్ తదితర తాత్కాలిక ఏర్పాట్లకు అవసరమైన వ్యయాన్ని కూడా కౌన్సిల్ ఆమోదించింది.ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్, కౌన్సిలర్లు మున్సిపాలిటీ అభివృద్ధికి సంబంధించిన అన్ని పనులను సమన్వయంతో, వేగవంతంగా అమలు చేయాలని అధికారులను ఆదేశించారు.

# చందానగర్‌లో బాలాజీ నగల దుకాణంలో చోరీ




- **వెనుకవైపు ఎగ్జాస్ట్ ఫ్యాన్ తొలగించి చొరబడిన దుండగులు**
- **ఏడు తులాల బంగారం, నాలుగు కిలోల వెండి అపహరణ**
- **ప్రత్యేక బృందాలతో గాలింపు**

**సైబరాబాద్ - విశాల భారతి**



చందానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని బాలాజీ నగల దుకాణంలో శుక్రవారం అర్ధరాత్రి గుర్తు తెలియని దుండగులు చోరీకి పాల్పడ్డారు. దుకాణం వెనుక భాగంలోని ఎగ్జాస్ట్ ఫ్యాన్‌ను తొలగించి లోపలికి ప్రవేశించిన దుండగులు బంగారు, వెండి ఆభరణాలను అపహరించిన ఘటన స్థానికంగా కలకలం రేపింది. సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు ప్రారంభించారు.పోలీసుల వివరాల ప్రకారం, నూకల శివశంకర్‌కు చెందిన బాలాజీ నగల దుకాణాన్ని లక్ష్యంగా చేసుకున్న దుండగులు ముందుగా వెనుక భాగంలో ఉన్న ఎగ్జాస్ట్ ఫ్యాన్‌ను తొలగించి గోడలోని రంధ్రాన్ని పెద్దదిగా చేశారు. ఆ మార్గం ద్వారా లోపలికి ప్రవేశించిన అనంతరం వెనుక గది నుంచి ముందు గదికి వెళ్లే తలుపుకు రంధ్రం చేసి ప్రధాన షోరూమ్‌లోకి చేరుకున్నారు. అక్కడ ఉన్న బంగారు, వెండి ఆభరణాలను అపహరించి పరారయ్యారు. ప్రాథమిక విచారణలో సుమారు ఏడు తులాల బంగారం, నాలుగు కిలోల వెండి చోరీకి గురైనట్లు పోలీసులు గుర్తించారు. అపహరించిన ఆభరణాల విలువపై పూర్తి వివరాలు యజమాని అందించిన సమాచారం ఆధారంగా నిర్ధారించనున్నట్లు తెలిపారు.ఘటన సమాచారం అందుకున్న వెంటనే డిప్యూటీ పోలీసు కమిషనర్ చింతమనేని శ్రీనివాస్, సహాయ పోలీసు కమిషనర్ చి వై శ్రీనివాస్ కుమార్, నేర పరిశోధన విభాగం, ప్రత్యేక ఆపరేషన్ బృందం, చందానగర్ పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. క్లూస్ బృందం, న్యాయ శాస్త్ర నిపుణులు వేలిముద్రలు, ఇతర భౌతిక ఆధారాలను సేకరించారు.దుకాణం పరిసరాల్లో ఏర్పాటు చేసిన నిఘా దృశ్యాలను పోలీసులు క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. సాంకేతిక ఆధారాలు, అనుమానితుల కదలికలు, ఇతర కోణాలను విశ్లేషిస్తూ ప్రత్యేక బృందాలు నిందితుల కోసం గాలింపు చేపట్టాయి. త్వరలోనే నిందితులను గుర్తించి అదుపులోకి తీసుకుంటామని పోలీసులు వెల్లడించారు. కేసు దర్యాప్తు కొనసాగుతోంది.

# బస్సు ఎక్కితే.. జేబు ఖాళీ..!

**ప్రయాణికులనే లక్ష్యంగా చేసుకున్న ముగ్గురు జేబుదొంగల అరెస్ట్ – రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం**



**విశాల భారతి, అబ్దుల్లాపూర్‌మెట్ :** బస్సు ఎక్కే ప్రయాణికుల రద్దీని ఆసరాగా చేసుకుని సెల్‌ఫోన్లు అపహరిస్తున్న ముగ్గురు అలవాటు నేరస్తులను నాగోల్ పోలీసులు అరెస్ట్ చేసి, వారి వద్ద నుంచి దొంగిలించిన ఒక ఐఫోన్, ఒక మోటరోలా సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నట్లు నాగోల్ పోలీస్ ఇన్స్పెక్టర్ మహమ్మద్ మక్బూల్ జానీ తెలిపారు. ఇన్స్పెక్టర్ తెలిపిన వివరాల ప్రకారం.. జూలై 31న నాగోల్ చౌరస్తా బస్‌స్టాండ్‌లో బస్సు కోసం వేచి ఉన్న నారాయణ రాజ్‌కుమార్, వెంకటాచారి బస్సు ఎక్కుతున్న సమయంలో కావడి శివ (22) వారిని మాటల్లో పెట్టి దృష్టి మరల్చాడు. అదే సమయంలో అతనితో పాటు ఉన్న మేకల జగపతి బాబు అలియాస్ జగపతి, బోయ అలియాస్ గారడీ మంజునాథ్ అలియాస్ మంజు ఇద్దరి జేబుల్లోని సెల్‌ఫోన్లను చాకచక్యంగా అపహరించి పరారయ్యారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు ఆగస్టు 1న నాగోల్ చౌరస్తా వద్ద అనుమానాస్పదంగా సంచరిస్తున్న ముగ్గురిని అదుపులోకి తీసుకుని విచారించగా నేరాన్ని ఒప్పుకున్నారని తెలిపారు. నిందితుల వద్ద నుంచి దొంగిలించిన రెండు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. విచారణలో ప్రధాన నిందితుడు మేకల జగపతి బాబుపై వివిధ పోలీస్‌స్టేషన్ల పరిధిలో ఏడు సెల్‌ఫోన్ చోరీ కేసులు, బోయ అలియాస్ గారడీ మంజునాథ్‌పై నాలుగు చోరీ కేసులు నమోదైనట్లు గుర్తించామని ఇన్స్పెక్టర్ మహమ్మద్ మక్బూల్ జానీ తెలిపారు. నిందితులను న్యాయస్థానంలో హాజరుపరచగా జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు. ప్రజలు బస్సులు ఎక్కే సమయంలో అప్రమత్తంగా ఉండాలని, రద్దీ ప్రాంతాల్లో విలువైన వస్తువులను జాగ్రత్తగా భద్రపరుచుకోవాలని ఇన్స్పెక్టర్ మహమ్మద్ మక్బూల్ జానీ సూచించారు.


# రోడ్డు విస్తరణలో పేదలకు అన్యాయం జరగొద్దు

- **శుభోదయ కాలనీ బాధితులతో కలిసి ఎంపీ ఈటల రాజేందర్‌ను కలిసిన మాజీ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి**



**విశాల భారతి, అబ్దుల్లాపూర్‌మెట్ :** హయత్‌నగర్ మండలం శుభోదయ కాలనీలో ప్రతిపాదిత హయత్‌నగర్-తారామతిపేట్ 100 అడుగుల రోడ్డు విస్తరణ వల్ల ఇళ్లు కోల్పోయే ప్రమాదంలో ఉన్న బాధిత కుటుంబాలకు న్యాయం చేయాలని కోరుతూ మాజీ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి, కాలనీవాసులతో కలిసి ఈటల రాజేందర్ ను ఆయన నివాసంలో కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా బాధితులు మాట్లాడుతూ.. మదర్ డెయిరీ సమీపంలో ప్రభుత్వం గతంలో కేటాయించిన 60 గజాల స్థలాల్లో ఇళ్లను నిర్మించుకుని ఎన్నో సంవత్సరాలుగా నివాసం ఉంటున్నామని తెలిపారు. ప్రస్తుతం ప్రతిపాదిత 100 అడుగుల రోడ్డు విస్తరణలో తమ ఇళ్లు పూర్తిగా ప్రభావితమవుతుండటంతో వందకు పైగా కుటుంబాలు నిరాశ్రయులయ్యే పరిస్థితి నెలకొన్నదని ఆవేదన వ్యక్తం చేశారు. రోడ్డు విస్తరణకు తమకు ఎలాంటి అభ్యంతరం లేదని, అయితే పేదల ఇళ్లను కూల్చివేయకుండా ఎదురుగా ఉన్న ఖాళీ ప్రభుత్వ భూమి వైపు నుంచి రోడ్డు విస్తరణ చేపట్టేలా సంబంధిత అధికారులతో చర్చించి చర్యలు తీసుకోవాలని ఎంపీని కోరారు.వినతిని స్వీకరించిన ఎంపీ ఈటల రాజేందర్ వెంటనే సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యను పరిశీలించి బాధితులకు న్యాయం జరిగేలా కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఈ సందర్భంగా మాజీ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి మాట్లాడుతూ.. అభివృద్ధి పేరుతో పేద ప్రజల ఇళ్లు, జీవనాధారం దెబ్బతినకుండా ప్రభుత్వం ప్రత్యామ్నాయ మార్గాలను పరిశీలించాలని కోరారు. శుభోదయ కాలనీ ప్రజలకు న్యాయం జరిగే వరకు తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో శుభోదయ కాలనీ బాధిత కుటుంబాల సభ్యులు, స్థానిక ప్రజాప్రతినిధులు, కాలనీవాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# మృతుడి కుటుంబానికి రూ. 5 లక్షల అందజేత




**కోదాడ,(విశాలభారతి):** తెలుగుదేశం పార్టీ కార్యకర్తలకు పార్టీ ఎల్లవేళలా అండగా ఉంటుందని రాష్ట్ర నాయకులు ముత్తినేని సైదేశ్వరరావు, ఓరుగంటి ప్రభాకర్ తెలిపారు. ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన కోదాడ పట్టణానికి చెందిన టీడీపీ కార్యకర్త గుండెపురి ఉపేందర్ కుటుంబాన్ని శనివారం పార్టీ నాయకులు పరామర్శించారు. ఉపేందర్‌కు పార్టీ సభ్యత్వం ఉండటంతో, ఇన్సూరెన్స్ ద్వారా మంజూరైన రూ. 5 లక్షల నగదును ఆయన భార్య నాగమణి బ్యాంకు ఖాతాలో జమ చేసినట్లు వెల్లడించారు. నారా లోకేశ్ నాయకత్వంలో కార్యకర్తలను అన్ని విధాలా ఆదుకుంటామని, మృతుడి ఇద్దరు పిల్లలను ఎన్టీఆర్ ట్రస్ట్ పాఠశాలలో చేర్పించి మెరుగైన విద్య అందిస్తామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ, కాంగ్రెస్ పార్టీల స్థానిక నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## జిల్లా రవాణా ఆర్టీఏ కార్యాలయమును సందర్శించిన జిల్లా కలెక్టర్

**విశాలభారతి, కామారెడ్డి ;** జిల్లా కలెక్టర్ ఆశిష్‌సాంగ్వాన్ ఫీల్డ్ విజిట్ లో భాగంగా జిల్లా రవాణా RTA కార్యాలయాన్ని సందర్శించారు. కార్యాలయ అధికారులను, సిబ్బంది నీ ఉద్దేశించి తగిన సూచనలు , సలహాలు ఇచ్చారు. కార్యాలయం అంతటా పరిశీలించి ఆవరణ లో మొక్క నాటడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. మొక్కలు నాటడం కాదు దాంతోపాటు సంరక్షించడం కూడా ఒక బాధ్యత అని అన్నారు. ఈ కార్యక్రమం లో అధికారులు డిటిఓ సంతోష్ కుమార్, మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ శంకర్ నారాయణ అసిస్టెంట్ ఇన్స్పెక్టర్ ఉదయ్ కుమార్, ఏవో నజీర్ , సిబ్బంది ప్రవీణ్ రెడ్డి, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## కేంద్ర ప్రభుత్వం లేబర్ కోడ్‌ల పేరుతో కార్మిక హక్కులను హరిస్తోంది: బచ్చలకూర స్వరాజ్యం



**మునగాల (విశాలభారతి):** భవన నిర్మాణ, గ్రామీణ హమాలీ, గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్, మధ్యాహ్న భోజన, ట్రాన్స్‌పోర్ట్ తదితర రంగాల కార్మికుల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు బచ్చలకూర స్వరాజ్యం డిమాండ్ చేశారు. శనివారం నేలమర్రి గ్రామంలో సిఐటియు ఆధ్వర్యంలో వివిధ కార్మిక సంఘాల సంయుక్త సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బచ్చలకూర స్వరాజ్యం మాట్లాడుతూ.. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మికులు సుదీర్ఘ పోరాటాల ద్వారా సాధించుకున్న 29 కార్మిక చట్టాలను రద్దు చేసి, నాలుగు లేబర్ కోడ్‌ల పేరుతో కొత్త చట్టాలను తెచ్చి కార్మిక హక్కులను హరించిందని మండిపడ్డారు. వెల్ఫేర్ బోర్డులో సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న క్లైములను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేబర్ కార్డులకు అర్హత ఉండి దరఖాస్తు చేసుకున్న వారందరికీ కార్డులు జారీ చేయాలన్నారు. 50 సంవత్సరాలు నిండి లేబర్ కార్డు కలిగిన ప్రతి కార్మికునికి నెలకు 5,000 రూపాయల పెన్షన్ అందించాలని, అలాగే హమాలీ కార్మికుల కోసం ప్రత్యేక వెల్ఫేర్ బోర్డును ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సిఐటియు నేలమర్రి గ్రామ నూతన కమిటీ ఎన్నిక సమావేశం అనంతరం సిఐటియు అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో నేలమర్రి గ్రామ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సిఐటియు గ్రామ కమిటీ అధ్యక్షుడిగా బచ్చలకూర రామణయ్య, కార్యదర్శిగా బచ్చలకూర సుధాకర్, ఉపాధ్యక్షుడిగా మామిడి వెంకన్న, సహాయ కార్యదర్శిగా బచ్చలకూర ఉపేందర్, కోశాధికారిగా కొలికపంగు ఈదయ్యలు ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో కార్మిక సంఘాల నాయకులు బి. రామాంజనేయులు, బి. రాజేష్, బి. ప్రసాద్, బి. వెంకటేశ్వర్లు, బి. ధనుమూర్తి, కే. ప్రభాకర్, సిహెచ్. జీదయ్య, బి. లింగస్వామి, బి. గోవర్ధన్, బి. వెంకన్న, బి. నరేందర్ మరియు కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## తెలంగాణ సాయుధ పోరాట వీరుల ఆశయ సాధనకు పునరంకితం కావాలి

**సిపిఎం మండల కార్యదర్శి బుర్రి శ్రీరాములు**



**మునగాల (విశాలభారతి):** మండల పరిధిలోని చారిత్రాత్మక కలకోవ గ్రామంలో ఎర్రజెండా నాయకత్వంలో అమరవీరుల సంస్మరణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం మునగాల మండల కార్యదర్శి బుర్రి శ్రీరాములు మాట్లాడుతూ.. నాటి తెలంగాణ సాయుధ పోరాట వీరుడు కేశబోయిన ముత్తయ్య, తొలి అమరుడు సీమ గురవయ్యల నుండి నేటి మండవ కోటయ్య వరకు 36 మంది అమరవీరుల వారసత్వాన్ని కలకోవ గ్రామ శాఖ గత 75 ఏళ్లుగా నీతి, నిజాయితీలతో ముందుకు తీసుకుపోతోందని కొనియాడారు. పెద్దలు, ప్రజాప్రతినిధుల చర్చలతో గ్రామాన్ని ఎంతో అభివృద్ధి చేశామన్నారు. గ్రామంలో అరాచక శక్తుల ఆటల్ని సాగకుండా అడ్డుకోవడమే అమరులకు నిజమైన నివాళి అని ఆయన పిలుపునిచ్చారు. గతంలో ఐఏఎస్ బుర్రి రామయ్య రైతులు, ప్రజలపై అక్రమ కేసులు, దాడులకు ఒడిగట్టగా, ప్రస్తుతం ఐపిఎస్ కొక్కు వీరయ్య చెరువు మధ్యలో అక్రమంగా బావి తవ్వి 25 ఎకరాలకు నీటిని తరలిస్తూ, సర్పంచ్‌పై ప్రైవేట్ కేసు వేసి ప్రజలను బెదిరిస్తున్నారని ఆరోపించారు. ఇలాంటి శక్తులపై పోలీసులు, అధికారులు, గ్రామ ప్రజలు అప్రమత్తంగా ఉండి ప్రశాంత వాతావరణాన్ని కాపాడాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఆటో డ్రైవర్ల శ్రమ వెలకట్టలేనిది: సర్పంచ్ డాక్టర్ వేమూరి సత్యనారాయణ



**మునగాల, (విశాల భారతి):** మండల పరిధిలోని నర్సింహాపురం గ్రామ పంచాయతీ ఆవరణలో ప్రపంచ ఆటో డ్రైవర్ల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. గ్రామ సర్పంచ్ డాక్టర్ వేమూరి సత్యనారాయణ ఆధ్వర్యంలో గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్లను శాలువాలతో సన్మానించి, స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. రాత్రింబవళ్లు కష్టపడుతూ ప్రజలను, విద్యార్థులను, కూలీలను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చుతున్న ఆటో డ్రైవర్ల శ్రమ వెలకట్టలేనిదని కొనియాడారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ పథకం వల్ల ఆటో కార్మికులు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారని, ప్రభుత్వం వారికి సబ్సిడీలు, బీమా, గుర్తింపు కార్డులతో పాటు ప్రతి నెలా పెన్షన్ ఇచ్చి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి బాలరాజు, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు మరియు ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.


## డిజిటల్ హ్యూమానిటీస్–కృత్రిమ మేధస్సుపై అంతర్జాతీయ సదస్సుకు జీఎన్ఐటీసీ




**విశాల భారతి ఇబ్రహీంపట్నం :** హైదరాబాద్‌లోని గురు నానక్ ఇన్‌స్టిట్యూషన్స్ టెక్నికల్ క్యాంపస్ (స్వయంప్రతిపత్తి) హ్యూమానిటీస్ అండ్ సైన్సెస్ విభాగం ఆధ్వర్యంలో రెండు రోజుల అంతర్జాతీయ సదస్సులో "ఇన్నోవేషన్స్ ఇన్ డిజిటల్ హ్యూమానిటీస్ త్రూ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ICIDHAI-2026)" జూలై 31 ఆగస్టు 1న విజయవంతంగా నిర్వహించారు. ఈ సదస్సును గౌరవ మేనేజింగ్ డైరెక్టర్ డా. హెచ్. ఎస్. సైనీ, ముఖ్య అతిథి డా. సి. కలైయరాసన్, డైరెక్టర్ డా. ఎస్. శ్రీనాథ రెడ్డి, అసిస్టెంట్ డైరెక్టర్ డా. బి. కేదార్‌నాథ్ తదితర ప్రముఖులు ప్రారంభించారు. సాంకేతిక సమావేశాల్లో ఎన్ఐటీ తిరుచిరాపల్లికు చెందిన డా. వి. కె. కార్తిక ముఖ్యోపన్యాసం అందించగా, ఐఐఐటీడీఎం కాంచీపురంకు చెందిన డా. కె. ఎం. సి. కంధరాజా ప్లీనరీ ఉపన్యాసం చేశారు. సదస్సులో 4 ఆఫ్‌లైన్ సెషన్లు, 30 ఆన్‌లైన్ ట్రాక్‌లలో మొత్తం 262 మంది పరిశోధకులు, అధ్యాపకులు తమ పరిశోధనా పత్రాలను సమర్పించారు. అంతర్జాతీయ కోణాలను ప్రతిబింబిస్తూ శ్రీలంక నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎడ్యుకేషన్‌కు చెందిన డా. దర్శనా సమరవీర, రోమేనియా అసోసియేషన్ ఫర్ లెర్నింగ్ కు చెందిన డా. డానా రాడ్లర్, యూకే ALT లిటరరీ ప్రెస్ జర్నల్ ప్రధాన సంపాదకులు డా. హాతేం అల్‌షమియా ప్లీనరీ ప్రసంగాలు చేశారు ఈ సదస్సులో డిజిటల్ హ్యూమానిటీస్, కృత్రిమ మేధస్సు ద్వారా సమగ్ర విద్యాభివృద్ధి, సాంస్కృతిక వారసత్వ పరిరక్షణ, నైతిక ఆవిష్కరణలు, డిజిటల్ అక్షరాస్యత పెంపు, సుస్థిర సామాజిక అభివృద్ధి వంటి అంశాలపై విస్తృతంగా చర్చించారు. సదస్సు విజయవంతం కావడానికి నిరంతరం ప్రోత్సాహం, మార్గదర్శకత్వం అందించిన గౌరవ వైస్ చైర్మన్ శ్రీ గగన్‌దీప్ సింగ్ కోహ్లీ, గౌరవ మేనేజింగ్ డైరెక్టర్ డా. హెచ్. ఎస్. సైనీలకు నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు.

## ఆలేరు రెవెన్యూ డివిజన్ సాధనకు కట్టుబడి ఉన్నాం..

- అభివృద్దే ప్రభుత్వ ధ్యేయం
- ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య



**ఆలేరు, విశాలభారతి :**

ఆలేరు రెవెన్యూ డివిజన్ ఏర్పాటు అంశంపై తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య శనివారం ఆలేరు ఆర్ అండ్ బీ గెస్ట్ హౌస్‌లో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆలేరు రెవెన్యూ డివిజన్ కోసం అఖిలపక్షాలు ధర్నా నిర్వహించడం ప్రజాస్వామ్య హక్కేనని, అయితే ప్రజలను తప్పుదోవ పట్టించేలా అసత్య ప్రచారం చేయడం సమంజసం కాదని అన్నారు. గత పదేళ్లు అధికారంలో ఉన్నవారు ఆలేరు రెవెన్యూ డివిజన్ అంశాన్ని ఎందుకు పట్టించుకోలేదని ప్రశ్నించారు. ఆ సమయంలో అసెంబ్లీలో ఈ అంశాన్ని ఎన్నిసార్లు ప్రస్తావించారో ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. అధికారంలో ఉన్నప్పుడు చేయలేని పనిని ఇప్పుడు రాజకీయ ప్రయోజనాల కోసం వినియోగించుకోవడం బాధాకరమని వ్యాఖ్యానించారు. తాను ఆలేరు రెవెన్యూ డివిజన్ అంశాన్ని అసెంబ్లీలో రెండుసార్లు ప్రస్తావించానని, తిరుమలపూర్ బహిరంగ సభలో కూడా ప్రజల ముందుకు తీసుకువెళ్లానని తెలిపారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డితో ప్రత్యేకంగా చర్చించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినట్లు వెల్లడించారు. ఆలేరు రెవెన్యూ డివిజన్ సాధించడమే తన లక్ష్యమని, ఈ అంశంపై నిరంతరం కృషి చేస్తున్నట్లు స్పష్టం చేశారు. గత ప్రభుత్వం 25 రెవెన్యూ డివిజన్లు ఏర్పాటు చేసినప్పటికీ ఆలేరును విస్మరించిందని విమర్శించారు. ఇప్పుడు అదే పార్టీ నాయకులు నిరసనలు చేయడం ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. ఆలేరు అభివృద్ధి విషయంలో తమ ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. మల్లాపూర్‌లో మెడికల్ కాలేజీ నిర్మాణం చేస్తామని గత ప్రభుత్వం ప్రకటించినప్పటికీ అమలు చేయలేకపోయిందని, తమ ప్రభుత్వం మాత్రం 20 ఎకరాల్లో మెడికల్ కాలేజీకి శంకుస్థాపన చేసిందని తెలిపారు. పట్టణ అభివృద్ధిలో భాగంగా సుమారు 500 మంది లబ్ధిదారులకు కొత్త రేషన్ కార్డులు అందించామని, 200 ఇళ్లను మంజూరు చేశామని చెప్పారు. తెలంగాణలో ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ కార్యక్రమంలో ఆలేరు మొదటి స్థానంలో నిలిచిందని వెల్లడించారు. గత పదేళ్లలో వచ్చిన నిధులతో పోలిస్తే కేవలం రెండున్నర సంవత్సరాల్లోనే సుమారు రూ.70 కోట్ల అభివృద్ధి నిధులు తీసుకొచ్చామని తెలిపారు. రూ.44 లక్షలతో సీసీ రోడ్లు నిర్మించామని, అండర్‌పాస్ పనులు వేగంగా కొనసాగుతున్నాయని, త్వరలో ప్రజలకు అందుబాటులోకి వస్తాయని చెప్పారు. ప్రతి మున్సిపాలిటీలో ఆధునిక మున్సిపల్ కార్యాలయ భవనాలు నిర్మిస్తున్నామని వెల్లడించారు. బహదూర్‌పేట చెరువును రూ.2.5 కోట్లతో అభివృద్ధి చేశామని, వచ్చే నెలలో మరో రూ.10 కోట్ల అభివృద్ధి నిధులు తీసుకురానున్నట్లు తెలిపారు. కొలనుపాక-కాల్వపల్లి వంతెన నిర్మాణ పనులు వేగంగా కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. చివరగా ప్రతిపక్షాలకు విజ్ఞప్తి చేస్తూ, ప్రజల ప్రయోజనాల కోసం అందరూ కలిసి పనిచేయాలని, ఆలేరు రెవెన్యూ డివిజన్ సాధనలో సహకరించాలని, అనవసర రాజకీయాలకు దూరంగా అభివృద్ధికి తోడ్పడాలని కోరారు. "ఆలేరు అభివృద్ధే మా ధ్యేయం... రెవెన్యూ డివిజన్ సాధనే మా లక్ష్యం" అని ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య స్పష్టం చేశారు.

## చందానగర్‌లో ఆభరణాల దుకాణాల భద్రతపై ప్రత్యేక ఆడిట్

- 21 భద్రతా ప్రమాణాల ఆధారంగా తనిఖీలు
- సీసీటీవీలు, అలారం వ్యవస్థలపై ప్రత్యేక పరిశీలన

**సైబరాబాద్ - విశాల భారతి**




చందానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఆభరణాల దుకాణాల భద్రతను మరింత పటిష్ఠం చేసేందుకు పోలీసులు ప్రత్యేక భద్రతా ఆడిట్ నిర్వహిస్తున్నారు. సెరిలింగంపల్లి జోన్ డిప్యూటీ కమిషనర్ చింతమనేని శ్రీనివాస్ ఆదేశాల మేరకు చేపట్టిన ఈ కార్యక్రమంలో ప్రతి ఆభరణాల దుకాణాన్ని క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. ఆస్తి సంబంధిత నేరాలను అరికట్టడం, దుకాణాల్లో భద్రతా ప్రమాణాలను మెరుగుపరచడం లక్ష్యంగా 21 అంశాలతో రూపొందించిన భద్రతా మార్గదర్శకాల అమలును అధికారులు తనిఖీ చేస్తున్నారు. ఇందులో సీసీటీవీ కెమెరాల పనితీరు, అలారం వ్యవస్థలు, స్ట్రాంగ్ రూమ్ భద్రత, ప్రవేశ నియంత్రణ విధానాలు, అత్యవసర పరిస్థితుల్లో స్పందించే ఏర్పాట్లు తదితర అంశాలను పరిశీలించి అవసరమైన సూచనలు అందిస్తున్నారు. భద్రతా లోపాలు గుర్తించిన చోట వాటిని వెంటనే సరిదిద్దుకోవాలని దుకాణ యజమానులను పోలీసులు ఆదేశిస్తున్నారు. భవిష్యత్తులో దొంగతనాలు, ఇతర ఆస్తి సంబంధిత నేరాలకు అవకాశం లేకుండా ఆధునిక భద్రతా వ్యవస్థలను ఏర్పాటు చేసుకోవాలని సూచిస్తున్నారు. ఈ ఆడిట్‌ను చందానగర్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఎ. శ్రీధర్ కుమార్ ఆధ్వర్యంలో డీఐ ప్రదీప్, ఎస్ఐ రాధిక, ఏఎస్ఐలు అశోక్, సీనయ్య, యాదమ్మ, హెచ్‌సిలు పద్మనాభం, శివకుమార్, విటలయ్యతో కూడిన ఆరు ప్రత్యేక బృందాలు నిర్వహిస్తున్నాయి. చందానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని అన్ని ఆభరణాల దుకాణాల్లో ఈ తనిఖీలు కొనసాగుతున్నాయని పోలీసులు తెలిపారు. దుకాణ యజమానులు పూర్తి సహకారం అందించి, సూచించిన భద్రతా ప్రమాణాలను తప్పనిసరిగా అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. అవసరమైతే ఇదే వార్తను మరింత పత్రికా శైలిలో ఆంధ్రజ్యోతి స్టైల్ లేదా సాక్షి స్టైల్లో కూడా మార్చి అందించగలను.

## జేబీఐఈటీలో ఘనంగా పట్టభద్రుల దినోత్సవం




**విద్యార్థులకు డిగ్రీలు ప్రదానం..**
**ప్రతిభావంతులకు బంగారు పతకాలు**





**మొయినాబాద్ ఆగస్టు 1(విశాలభారతి):** జేఎన్‌టీయూహెచ్‌కు శాశ్వత అనుబంధం, యూజీసీ స్వయంప్రతిపత్తి కలిగిన జె.బి. ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ (జేబీఐఈటీ)లో 15వ పట్టభద్రుల దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. బీటెక్, ఎంటెక్, ఎంబీఏ కోర్సులను పూర్తి చేసిన విద్యార్థులకు డిగ్రీ పట్టాలను ప్రదానం చేశారు. విద్యలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను బంగారు పతకాలు, ప్రశంసాపత్రాలతో సత్కరించారు. అకాడమిక్ వస్త్రధారణలో అధ్యాపకులు, విభాగాధిపతులు, అతిథుల ఊరేగింపుతో కార్యక్రమం ప్రారంభమైంది. జేబీ ఎడ్యుకేషనల్ సొసైటీ కార్యదర్శి జె.వి. కృష్ణారావు వార్షిక నివేదికను సమర్పిస్తూ, విద్యా ప్రమాణాల పెంపు, ఆధునిక మౌలిక వసతులు, పరిశోధన, ప్లేస్‌మెంట్లు, పరిశ్రమలతో భాగస్వామ్యంలో కళాశాల సాధించిన పురోగతిని వివరించారు. ముఖ్య అతిథులుగా జేపీ మోర్గాన్ చేజ్ అండ్ కో. వైస్ ప్రెసిడెంట్ మారియో డేవిడ్, డైపుకు ఇంట్రాలాజిస్టిక్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ చైర్మన్ శ్రీనివాస్ గారిమెళ్ల, ప్రముఖ శాస్త్రవేత్త అమిత్ కుమార్ చతుర్వేది పాల్గొన్నారు. విద్యార్థులు నాయకత్వ లక్షణాలు, సృజనాత్మకత, నైపుణ్యాలను పెంపొందించుకొని పరిశ్రమలు, దేశాభివృద్ధిలో కీలక పాత్ర పోషించాలని వారు సూచించారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన పద్మశ్రీ ప్రొఫెసర్ కొలకలూరి ఇనాక్ మాట్లాడుతూ, విద్య వ్యక్తిగత విజయానికే కాకుండా సమాజాభివృద్ధికి దోహదపడాలని అన్నారు. అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ డా. పి.సి. కృష్ణమాచారి పట్టభద్రులకు డిగ్రీలను అందజేశారు. కార్యక్రమం అనంతరం పట్టభద్రులు అధ్యాపకులు, కుటుంబ సభ్యులతో కలిసి ఆనందంగా జ్ఞాపకాలను పంచుకున్నారు.

## కామారెడ్డి ట్రాఫిక్ అవుట్‌పోస్ట్‌ను ప్రారంభించిన జిల్లా ఎస్పీ యం. రాజేష్ చంద్ర

**విశాలభారతి, కామారెడ్డి :** కామారెడ్డి పట్టణంలోని ట్రాఫిక్ అవుట్ పోస్ట్ భవనానికి పూర్తిస్థాయిలో మరమ్మతులు చేపట్టి, ప్రజలకు మరింత అనుకూలంగా నవీకరించిన ట్రాఫిక్ అవుట్ పోస్ట్‌ను జిల్లా ఎస్పీ యం. రాజేష్ చంద్ర, ఐపీఎస్ ప్రారంభించారు. పట్టణంలో రోజురోజుకూ పెరుగుతున్న వాహన రద్దీ, ట్రాఫిక్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని ప్రజలకు వేగవంతమైన, సమర్థవంతమైన సేవలు అందించాలనే ఉద్దేశంతో ట్రాఫిక్ అవుట్ పోస్ట్‌ను మరింత మెరుగుపరిచారు. ఈ సందర్భంగా కామారెడ్డి ట్రాఫిక్ అవుట్ పోస్ట్‌కు నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ట్రాఫిక్ ఎస్ఐ చంద్రశేఖర్ గౌడ్ జిల్లా ఎస్పీ స్వయంగా ఆయన విధి నిర్వహణ స్థానంలో కూర్చోబెట్టి అభినందించారు. ట్రాఫిక్ నిర్వహణలో క్రమశిక్షణ, ప్రజలతో మర్యాదపూర్వక వ్యవహారం, వేగవంతమైన స్పందనతో విధులు నిర్వహించాలని సూచిస్తూ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, కామారెడ్డి పట్టణంలో పెరుగుతున్న వాహన రద్దీకి అనుగుణంగా ట్రాఫిక్ వ్యవస్థను మరింత పటిష్ఠం చేయడానికి ట్రాఫిక్ అవుట్ పోస్ట్‌కు అవసరమైన పోలీసు సిబ్బందిని కేటాయించినట్లు తెలిపారు. రహదారులపై ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించడం, రోడ్డు ప్రమాదాలను తగ్గించడం, ప్రజలకు సురక్షితమైన ప్రయాణ వాతావరణం కల్పించడం పోలీసు శాఖ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు.

## నెలకే రోడ్డు చిందరవందర.. ప్రజాధనం వృథా!

- కేఎస్ఆర్ లేఅవుట్‌లో నాసిరకం పనులపై టీఆర్ఎస్ ఆగ్రహం
- కాంట్రాక్టర్, అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్



**శేరిలింగంపల్లి విశాల భారతి:** శేరిలింగంపల్లి నియోజకవర్గం చందానగర్ డివిజన్ పరిధిలోని కేఎస్ఆర్ లేఅవుట్‌లో ఇటీవల నిర్మించిన తారు రహదారి నెల రోజుల్లోనే దెబ్బతినడంపై టీఆర్ఎస్ ఇన్‌ఛార్జి వాసిలి చంద్రశేఖర్ ప్రసాద్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. నాణ్యతా ప్రమాణాలను విస్మరించి రోడ్డు నిర్మాణం చేపట్టడం వల్లే ఈ పరిస్థితి నెలకొందని ఆరోపించారు. జూన్ 29న నిర్మించిన రహదారి జులై 31 నాటికే పలు చోట్ల గుంతలు ఏర్పడి దెబ్బతినడం పనుల నాణ్యతకు నిదర్శనమని ఆయన పేర్కొన్నారు. ప్రజల పన్నుల రూపంలో ఖర్చు చేస్తున్న ప్రభుత్వ నిధులు వృథా అవుతున్నా సంబంధిత అధికారులు, కాంట్రాక్టర్లు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదని విమర్శించారు. పనులు పూర్తయిన వెంటనే నాణ్యతను పరిశీలించి ధ్రువీకరించాల్సిన అధికారులు తమ బాధ్యతలను నిర్వర్తించడంలో విఫలమయ్యారని ఆరోపించారు. ఈ ఘటనపై స్థానిక ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ వెంటనే స్పందించి పూర్తి స్థాయి విచారణకు ఆదేశాలు ఇవ్వాలని వాసిలి చంద్రశేఖర్ ప్రసాద్ కోరారు. నాణ్యతా ప్రమాణాలు పాటించకుండా రహదారి నిర్మించిన కాంట్రాక్టర్‌తోనే అదనపు ప్రజాధనం ఖర్చు చేయకుండా రోడ్డును తిరిగి నిర్మింపజేయాలని డిమాండ్ చేశారు. అలాగే నిర్లక్ష్యం వహించిన అధికారులపై శాఖాపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు, కాంట్రాక్టర్ లైసెన్స్‌ను రద్దు చేసి బ్లాక్‌లిస్ట్‌లో చేర్చాలని కోరారు. నాసిరకం పనులు చేసే వారిపై కఠిన చర్యలు తీసుకున్నప్పుడే ప్రభుత్వ పనుల్లో నాణ్యత పెరుగుతుందని, ప్రజాధనం దుర్వినియోగానికి అడ్డుకట్ట పడుతుందని ఆయన స్పష్టం చేశారు. స్థానిక ప్రజల ప్రయోజనాల దృష్ట్యా ఈ అంశాన్ని ప్రభుత్వం, సంబంధిత అధికారులు అత్యవసరంగా పరిగణించి చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.

## గల్లంతైన బాలయ్య కుటుంబానికి రూ.50 వేల సాయం

- గాలింపు చర్యలు వేగవంతం చేయాలని బీఆర్ఎస్ డిమాండ్
- బాధిత కుటుంబానికి ప్రభుత్వం అండగా నిలవాలని విజ్ఞప్తి



**శేరిలింగంపల్లి విశాల భారతి:** కొండాపూర్ డివిజన్ ప్రేమ్‌నగర్ నాలాలో గల్లంతైన వృద్ధుడు బాలయ్య కుటుంబానికి శేరిలింగంపల్లి బీఆర్ఎస్ నాయకులు శనివారం రూ.50 వేల ఆర్థిక సాయం అందజేశారు. కుటుంబం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో తాత్కాలిక ఉపశమనంగా ఈ సాయం చేసినట్లు తెలిపారు. బాలయ్య గల్లంతై ఐదు రోజులు గడిచినా ఇప్పటికీ ఆచూకీ లభించకపోవడం ఆందోళన కలిగిస్తోందని బీఆర్ఎస్ నాయకులు పేర్కొన్నారు. గాలింపు చర్యలు ఆశించిన స్థాయిలో సాగడం లేదని, సంబంధిత అధికారులు ప్రత్యేక దృష్టి సారించి మరింత వేగవంతంగా శోధన కొనసాగించాలని డిమాండ్ చేశారు. అలాగే ప్రజాప్రతినిధులు, అధికార యంత్రాంగం బాధిత కుటుంబానికి అండగా నిలిచి తక్షణ సహాయక చర్యలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో శేరిలింగంపల్లి బీఆర్ఎస్ మాజీ కార్పొరేటర్లు, సీనియర్ నాయకులు, మహిళా నాయకులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## గంగారం ఆలయాల పరిరక్షణకు చొరవ

**మెట్రో పనుల వల్ల నష్టం వాటిల్లకుండా చూస్తాం : ఎంపి కొండా విశ్వేశ్వర్ రెడ్డి**




**శేరిలింగంపల్లి విశాల భారతి:** మియాపూర్ నుంచి పఠాన్ చెరువు వరకు చేపట్టబోతున్న మెట్రో రైలు, ఫ్లైఓవర్, రోడ్డు విస్తరణ పనుల వల్ల చందానగర్ గంగారం గ్రామంలోని ఆలయాలకు ఇబ్బంది ఏర్పడుతుందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో చేవెళ్ల పార్లమెంట్ సభ్యులు కొండా విశ్వేశ్వర్ రెడ్డి, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, శేరిలింగంపల్లి అసెంబ్లీ ఇంచార్జి రవికుమార్ యాదవ్ గంగారం గ్రామంలో పర్యటించారు. రామాలయం, ఆంజనేయ స్వామి ఆలయం, పోచమ్మ ఆలయం పరిసరాలను సందర్శించి స్థానికులతో మాట్లాడారు. పనుల కారణంగా ఆంజనేయ స్వామి ఆలయ గోపురం దెబ్బతినే అవకాశం ఉందని, పోచమ్మ ఆలయాన్ని తొలగించాల్సిన పరిస్థితి ఉందని గ్రామస్తులు వివరించారు. దీనిపై స్పందించిన నాయకులు అభివృద్ధిని అడ్డుకోబోమని, అయితే ఆలయాలకు నష్టం కలగకుండా ప్లాన్ లో మార్పులు చేయించేందుకు అధికారులతో మాట్లాడతామని హామీ ఇచ్చారు. పోచమ్మ ఆలయ నిర్మాణానికి గ్రామంలోనే స్థలం కేటాయించేలా కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మహిపాల్ రెడ్డి, జితేందర్, దేవాల్ యాదవ్, అనిల్ గౌడ్, రామకృష్ణ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ చైతన్య స్కూల్ బస్సుల నిర్వహణపై స్థానికుల ఆందోళన

- రాంగ్‌రూట్‌లో బస్సులు నడుస్తున్నాయంటూ ఆరోపణలు
- చిన్నారుల భద్రతపై తల్లిదండ్రుల ఆవేదన




**మొయినాబాద్, ఆగస్టు 1: (విశాలభారతి):** మొయినాబాద్ మండలంలో నడుస్తున్న శ్రీ చైతన్య పాఠశాల బస్సుల నిర్వహణపై స్థానికులు, తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బస్సులు కొన్నిసార్లు రాంగ్‌రూట్‌లో వెళ్తున్నాయని, దీంతో విద్యార్థుల భద్రతపై ఆందోళన నెలకొందని పేర్కొంటున్నారు. ఇప్పటికే బస్సుల్లో అధిక సంఖ్యలో విద్యార్థులను ఎక్కిస్తున్నారని, ప్రయాణ సమయంలో పిల్లలు ఇబ్బందులు పడుతున్నారని తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి పాఠశాల బస్సుల నిర్వహణ, రవాణా నిబంధనల అమలును పరిశీలించాలని వారు కోరుతున్నారు. విద్యార్థుల భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇస్తూ స్కూల్ బస్సులపై ప్రత్యేక తనిఖీలు నిర్వహించి, నిబంధనలు ఉల్లంఘించినట్లయితే తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.



# నీట్ పేపర్ లీక్ వల్ల సర్వస్వాన్ని కోల్పోయాను

మాజీ ప్రపంచ సుందరి, బాలీవుడ్ నటి మానుషి చిల్లర్ తన విద్యార్థి దశలో నీట్ పేపర్ లీక్ అవ్వడం వలన పడ్డ కష్టాలను గుర్తుచేసుకుంటూ ఆసక్తికర విషయాలను పంచుకుంది. సోహా అలీ ఖాన్ నిర్వహించిన 'ఆల్ అబౌట్ హర్' యూట్యూబ్ టాక్ షోలో పాల్గొన్న ఆమె, 2015 నాటి వైద్య ప్రవేశ పరీక్ష (నీట్) పేపర్ లీక్ ఉదంతం తనపై ఎంత తీవ్రమైన మానసిక ప్రభావాన్ని చూపిందో వివరించారు. ఎంతో కష్టపడి ప్రిపేర్ అయిన తర్వాత పరీక్ష రద్దు కావడం, మళ్లీ రాయాల్సి రావడం తన జీవితంలోనే అత్యంత కఠినమైన కాలమని ఆమె తెలిపారు. వైద్య వృత్తిపై మక్కువతో తాను ఎంతో ఇష్టపడే కూచిపూడి నృత్యం, పెయింటింగ్ వంటి వాటిని ఒక సంవత్సర కాలం పాటు పూర్తిగా పక్కన పెట్టానని, తన సంతోషాలన్నింటినీ త్యాగం చేయాల్సి వచ్చిందని పేర్కొన్నారు.తల్లిదండ్రులు ఇద్దరూ డాక్టర్లు కావడంతో మానసికంగా తనకు ఎంతో అండగా నిలిచారని, అయితే సాధారణ విద్యార్థులు పడే ఇబ్బందులను తాను ప్రత్యక్షంగా చూశానని మానుషి వెల్లడించారు. ఎంతోమంది విద్యార్థులు కోచింగ్ కోసం అప్పులు చేసి, వేరే నగరాలకు వెళ్లి చదువుకుంటున్నారని, అలాంటి సమయంలో పరీక్ష మళ్లీ రాయాల్సి రావడం వల్ల విద్యార్థులు ఎంతటి మానసిక ఒత్తిడికి గురవుతారో మాటల్లో చెప్పలేమని అన్నారు. పరీక్ష తేదీ పొడిగించిన ఆ 45 రోజులు మరింత కష్టంగా మారిందని, ఇంకెంత శక్తి మిగిలి ఉందో అనిపించేదని ఆమె గుర్తుచేసుకున్నారు. అయితే తన తల్లిదండ్రులు రోజుకో గంట వ్యాయామం, బాస్కెట్‌బాల్ ఆడటం వంటి వాటికి కేటాయించాలని చెప్పడం వల్లే తాను డిప్రెషన్‌లోకి వెళ్లకుండా మానసిక ప్రశాంతతను కాపాడుకోగలిగానని తెలిపారు. ఎంబీబీఎస్ పూర్తి చేసిన తర్వాత మిస్ వరల్డ్ 2017 కిరీటాన్ని గెలుచుకున్న మానుషి, ఆ తర్వాత అనూహ్యంగా సినిమాల్లోకి ప్రవేశించారు. 'సమ్రాట్ పృథ్వీరాజ్' చిత్రంతో బాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇచ్చిన ఆమె, ఆ తర్వాత 'ది గ్రేట్ ఇండియన్ ఫ్యామిలీ', 'ఆపరేషన్ వాలెంటైన్' వంటి చిత్రాలతో నటిగా గుర్తింపు తెచ్చుకున్నారు.

Published by Rajini Pagilla on behalf of Keerthi Media House, Editor : Gangarapu Vijay. RNI No APTEL/2010/32877.